# ఉరి

డాక్టర్ - తుమ్మల రామకృష్ణ



కృష్ణారెడ్డి తన గదిలో కూర్చుని సీరియస్‌గా చదువుకుంటున్నాడు. అతని చేతిలో 'మనిషిపై పరిసరాల ప్రభావం' అనే గ్రంథం ఉంది.

"టెలిగ్రాం! టెలిగ్రాం!"

"... ..."

"సార్! మీకు టెలిగ్రాం ఉంది!"

టక ... టక... టక ....

తలుపు తట్టిన శబ్దం వినిపించింది.

కృష్ణారెడ్డి ఉలిక్కిపడ్డాడు.

చదువుతున్న పుస్తకంలో గుర్తుగా పేజీ మడిచి పక్కన పెట్టి, గది తలుపు తీసుకుని వెలుపలకు వచ్చాడు.

ఎదురుగా టెలిగ్రామ్ని చేతిలో పట్టుకుని ఉన్న మెసెంజర్.

మెసెంజర్ కృష్ణారెడ్డిచేత సంతకం పెట్టించుకుని టెలిగ్రామ్ చేతికిచ్చి వెళ్లాడు.

టెలిగ్రామ్ అందుకున్న కృష్ణారెడ్డి చేతులు సన్నగా వణికాయి. గుండె వేగంగా కొట్టుకోసాగింది. సమాచారం ఏమై ఉంటుందో నన్న ఆందోళన ఎక్కువయింది. ఒళ్లంతా చెమట పట్టింది.



అందుకున్న టెలిగ్రామ్‌లోని సమాచారం కృష్ణారెడ్డి చదువుకోక తప్పలేదు.

అందులో సారాంశం క్లుప్తంగానే ఉంది.

"ఊర్లోకి రావద్దు !"

కృష్ణారెడ్డి ఆత్రంగా టెలిగ్రామ్‌లోన్ని సమాచారం ఒకటికి రెండుసార్లు చదువుకున్నాడు.

పొరపాటుగా వచ్చిన టెలిగ్రామ్ కాదు.

తన పేరు, తన గది నంబరు అన్నీ కరెక్టుగానే ఉన్నాయి.

టెలిగ్రామ్ ఇచ్చింది కూడా ఎవరో కాదు, తన తండ్రే.

కృష్ణారెడ్డి ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి.

"ఊర్లోకి రావద్దు !"

తను పుట్టి పెరిగిన ఊరు.

చిన్నతనంలో తను నలుగురి పిల్లలతో కలిసి ఆడుకున్న ఊరు. తను పదో తరగతి వరకు చదువుకున్న ఊరు.

ఇప్పుడు ఆ ఊరికి ఏమైంది? తన నెందుకు ఊళ్లోకి రావద్దని టెలిగ్రామ్ ఇచ్చారు? ఏదో జరిగి ఉంటుంది? ఏం జరిగి ఉంటుంది? చుట్టుపక్కల పల్లెలన్నీ ఫ్యాక్షన్‌లో ఇన్‌వాల్వ్ అయినా ఏ గొడవా ఇప్పటివరకు లేకున్న ఉన్న ఊరు అదొక్కటే. ఆ ఊరికి ఫ్యాక్షన్ అంటువ్యాధి సోకలేదు కదా! అ దేదీ లేకపోతే 'ఊళ్లోకి రావద్దు' అని ఎందుకు టెలిగ్రామ్ ఇస్తారు?

చదువు పేరుతో తను ఆ ఊరు వదిలిపెట్టి పదేళ్లు కావస్తోంది. వేసవి సెలవులకి కూడా తను ఆ ఊరికి వెళ్లి రావడంలేదు. పరిశోధన రంగంలో అడుగు పెట్టిన తర్వాత తనకీ, తన ఊరికీ మధ్య ఎంతో ఎడం పెరిగిపోయింది. సెలవుల్లో కూడా లైబ్రరీని అంటిపెట్టుకుని ఉండాల్సి వస్తోంది.

క్లాస్‌మేట్ సుబ్రహ్మణ్యంరెడ్డి పోరు పెడితే ఒక వేసవి అంతా మదనపల్లిలో గడిపాడు. హార్సిలీ హిల్స్ వాతావరణం తనకు బాగా నచ్చింది. జీవితంలో సెటిల్ అయిన తర్వాత ఇల్లంటూ కట్టుకుంటే హార్సిలీ హిల్స్ ప్రాంతంలోనే కట్టుకోవాలి అని నిశ్చయించుకున్నాడు. అక్కడి మనుషులు, వాళ్ల అభిమానాలు, ఆప్యాయతలు కృష్ణారెడ్డిని చక్కగా ఆకట్టుకున్నాయి.

ఎంత వద్దనుకున్నా కృష్ణారెడ్డి ఆలోచనలు తన ఊరి చుట్టూనే తిరుగుతున్నాయి. అమ్మ, నాన్న తమ్ముడు, చెల్లెలు - అందరూ కళ్ల ముందు తిరుగాడుతున్నారు.

అసలు ఊర్లో ఏం జరిగింది?

తన నెందుకు ఊర్లోకి రావద్దన్నారు?

తన ఇంట్లో వ్యక్తులు ఎందులోనూ ఇన్‌వాల్వ్ కాలేదు కదా! ఏమో, ఎవరికి తెలుసు? పరిస్థితులకు మనిషి బానిస.

రకరకాల ఆలోచనలతో కృష్ణారెడ్డి తల వేడెక్కిపోతోంది. కృష్ణారెడ్డి ఆలోచనల్లో నారాయణరెడ్డి మెదిలాడు.

నారాయణరెడ్డి కృష్ణారెడ్డికి స్వయాన తమ్ముడు.

మనిషి బలంగా, ఎత్తుగా ఉంటాడు. స్కూలు ఫైనల్‌తోనే చదువు కొండెక్కింది. పై చదువులు అబ్బకపోయినా నష్టం లేదు. పొలమ్మూ పుట్రా దండిగానే ఉంది. ఒళ్లొంచి సేద్యం చేయించుకున్నా హాయిగానే బతకచ్చు. నారాయణరెడ్డికి చదువు ఎంత ఒంటబట్టిందో సేద్యమూ అంతే వంటబట్టింది.

నారాయణరెడ్డి చదువు మానేసినప్పటి నుంచి నలుగుర్ని కూడేసుకుని బనగానపల్లికి, కోయిలకుంట్లకి, నంద్యాలకి ఒకటికి పదిసార్లు తిరగడం మొదలుపెట్టాడు. ఊర్లో చిన్న చిన్న తగాదాలు తీరుస్తూ మధ్యస్తాలు నడిపే స్థాయికి ఎదిగాడు. తాను ఒకటి, రెండుసార్లు నారాయణరెడ్డిని గురించి ఇంట్లో హెచ్చరించినా వినీ విననట్లే ఉన్నారు. పైగా ఒకసారి "సు వ్వేమో పై చదువులంటూ తిరుపతికి వెళ్లిపోతివి. ఇంటి విషయాలు, ఊరి విషయాలు ఎవురు పట్టించుకుంటారు? మీ తాత బతికున్నంత కాలం మన ఊరి ప్రెసిడెంటుగా ఉండె. ఊర్లోని వా రంతా మన కుటుంబం అంటే ఎంతో గౌరవం చూపుతా ఉండ్రి. ఇప్పుడు చూడు ఊర్లో మనల్ని ఎవురైనా మతిస్తా ఉన్నారా? ఏదో వాడైనా ప్రయోజకుడైతే బావుణ్ణు" అని చాటుమాటుగా అమ్మ, నాన్న అన్నమాటలు గుర్తు కొచ్చాయి కృష్ణారెడ్డికి.

చిన్నప్పుడు నారాయణరెడ్డిని గురించి ఇంట్లో కథలు కథలుగా చెప్పుకొనేవారు.

ఎంత చీకటైనా రోడ్డు మీద బస్సు దిగి భయపడకుండా ఇంటికి నడిచి వచ్చేవాడనీ, ఎవరూ తోడు లేకపోయినా రాత్రుల్లో ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లి వచ్చేవాడనీ, ఒకసారి పాముని చేత్తో పట్టుకున్నాడనీ, ఊరి ముందర పందిపిల్లలు చేసుకోనుంటే దాన్ని ఏమారించి దాని పిల్లని ఒకదాన్ని ఎత్తుకొచ్చాడనీ, నాటుబాంబులు చేతి సంచిలో పెట్టుకొని జాగ్రత్తగా తీసుకెళ్లి ఇంకో ఊళ్లో ఇచ్చి వచ్చాడనీ చెప్పుకొని మురిసిపోయేవారు. నారాయణరెడ్డి చేసిన పనుల వెనుక ఎంత మూర్ఖత్వం, అజ్ఞానం, దాగుందో తెలుసుకోలేకపోయారు. అవన్నీ సాహసాలు కావు. మూర్ఖత్వంతో కూడుకున్న పనులని చెప్పినా పెదవి విరిచి పెడచెవిన పెట్టారు.

కృష్ణారెడ్డి దృష్టిలో తండ్రి ఒక భేషజం మనిషి. చిన్నప్పటి నుంచి చిన్న కష్టం కూడా తెలియకుండా పెరిగిన మనిషి. గొప్పలకిపోయి వేలకు వేలు అప్పు తెచ్చి ఖర్చు పెట్టమంటే పెద్దపులి. ఇంటి పట్టున ఉండడం, ఇంటి విషయాలు పట్టించుకోవడం ఆయన దృష్టిలో పనికిమాలిన విషయాలు. మంది పనులు నెత్తిన వేసుకుని ఎప్పుడూ బస్సు ఎక్కుతుంటాడు, దిగుతుంటాడు. ఎక్కడికి పోతాడో, ఎప్పుడు వస్తాడో అమ్మకు కూడా చెప్పేవారు కాదు. తండ్రి అలుసు వల్లే తమ్ముడు అలా తయారయ్యాడు. లేకుంటే వాడి వయసుకి మధ్యస్తాలు చేయడం ఏమిటి? నలుగుర్ని వెంటబెట్టుకొని తిరగడం ఏమిటి? డబ్బును మంచినీళ్లులా ఖర్చు చేయడం ఏమిటి? 'అంత డబ్బు ఎక్కడ నుంచి వస్తావుంది?' అని ఒక్క రోజైనా అమ్మ, నాన్న నిలదీసి అడిగుంటే వాడు అలా తయారైయ్యేవాడా? తప్పంతా పెద్దలదే అనిపించింది కృష్ణారెడ్డికి.

ఆ మధ్య చెల్లెలు సుజాత ఉత్తరం రాస్తూ చిన్నన్న ఊర్లో బ్రాందీ షాపు పెట్టాడని తెలియజేసింది.

కృష్ణారెడ్డి ఉత్తరం చదివి ఆశ్చర్యపోయాడు.

రెడ్డి కులంలో పుట్టి కయ్యో కాలవో దున్నుకోని బతక్కుండా బ్రాందీ షాపులు, సారాయి అంగళ్లు పెట్టుకోవడం ఏమిటి? డబ్బు పాపిష్టిది! దానికి లోబడితే అది మనిషిని ఎంతైనా దిగజారుస్తుంది. ఏ అఘాయిత్యమైనా చేయిస్తుంది. అంతగా సంపాయించాలనుకుంటే మరో వ్యాపారం దొరకలేదా?

ఊర్లో బ్రాందీ షాపుకు సంబంధించిన గొడవలు ఏమీ తలెత్తలేదు కదా!

కృష్ణారెడ్డికి ఆలోచనల మధ్య సరిగ్గా నిద్దరకూడా పట్టడంలేదు. రాత్రులు మేల్కొని ఏవేవో పుస్తకాలు చదువుతున్నాడు. అందులోని విషయాలు మాత్రం ఒకటి కూడా బుర్ర కెక్కడం లేదు. చదివి చదివి ఎప్పుడో అలసిపోయి తెల్లవారుజాముల్లో కునుకుతీస్తున్నాడు.

కన్ను మూస్తే భయంకరమైన దృశ్యాలు.

ఆఘమేఘాల మీద దూసుకెళుతున్న జీపులు.

జీపుల నిండుకు పట్టీ పట్టకుండా కూర్చున్న మనుషులు. వింత వింత మనుషులు. రకరకాల మనుషులు.

జీపుల్లోంచి తొంగి చూస్తున్న తుపాకులు.

బాంబులు విసురుకోవడాలు.

కాళ్లు చేతులు తెగి విలవిల్లాడుతున్న మనుషులు.

పోల్చడానికి కూడా వీల్లేకుండా చెదిరిపోయిన ముఖాలు.

భుజాలకు, నడుములకు తూటాల హారాలు తగిలించుకుని తుపాకులు చేతబట్టుకుని పరిగెడుతున్న మనుషులు.

కొడవళ్లు, గొడ్డండ్లు చేతబట్టుకుని 'నరుకు, చంపు' అని అరుస్తూ ఉరుకుతున్న జనాలు.

కోర్టు చుట్టు తిరుగుతున్న మనుషులు.

ఏడుపులు... అరుపులు...

లాయర్ల ఇంటి చుట్టూ డబ్బు సంచులు చేతబట్టుకుని తిరుగుతున్న మనుషులు.

రకరకాల దృశ్యాలు.. వింత వింత దృశ్యాలు...



## కునికా రాగాలు

సుచిత్రా కృష్ణమూర్తి, షిబాల మార్గంలో నటి కునిక కూడా గాయనిగా మారింది. కూనిరాగాలు తీస్తూ తీస్తూ తానుకూడా ఎందుకు పాట పాడకూడదని అనుకుని మొదలుపెట్టింది. 'ఖట్టా మిట్టా' పేరిట ఒక ఆల్బమ్ విడుదల చేసేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. గాయకుడు కుమార్ సానుతో సన్నిహిత సంబంధాల వల్లనే కునిక గాయనిగా మారింద నేది మరో పుకారు. ఏది నిజమో ఎవరి కెరుక?!

మసూద్ అన్సారి

భయంగొల్పే దృశ్యాలు.

వారం రోజులుగా కన్నుమూస్తే కృష్ణారెడ్డికి ఇలాంటి భయంకర దృశ్యాలే కనబడుతున్నాయి. కృష్ణారెడ్డి మనసు మనసులో లేదు. వేళకు అన్నం తినాలన్న ధ్యాస కూడా లేదు. తన కెక్కడ పిచ్చెక్కుతుందో నన్న భయం పీక్కుతింటూ ఉంది. ఎక్కడో ఏమో జరిగితే తను ఇక్కడ విలవిల్లాడిపోవాల్సి వస్తోంది. తప్పు చేసి శిక్ష అనుభవించడం వేరు. తప్పూ చేయకుండా శిక్ష అనుభవించడం దుర్భరం!

గది తలుపు ఎవరో తట్టినట్లయింది.

కృష్ణారెడ్డి నిద్రకళ్లతో వెళ్లి తలుపు తీశాడు.

ఎదురుగా భాస్కరరెడ్డి దర్శన మిచ్చాడు.

భాస్కరరెడ్డి కృష్ణారెడ్డికి వేలు విడిచిన మేనమామ.

"రా... మామా... రా..."

కృష్ణారెడ్డి గది లోపలికి అడుగుపెడుతూ... "ఇంత పెద్ద రూములో నువ్వు ఒక్కడివేనా ఉండేది" అనుమానం వ్యక్తం చేశాడు.

"ప్రస్తుతానికి ఒక్కడినే... కూర్చో మామా." కృష్ణారెడ్డి కుర్చీ చూపించాడు.

భాస్కరరెడ్డి కుర్చీలో కూచుంటూ "గది తలుపులు మూసేయి కృష్ణా" అన్నాడు.

కృష్ణారెడ్డి గది తలుపులు మూసి గడియపెట్టాడు.

భాస్కరరెడ్డి కృష్ణారెడ్డి ముఖంలోకి పరీక్షగా చూశాడు.

కృష్ణారెడ్డి బాగా టెన్షన్ అనుభవిస్తున్నట్లుంది.

"ఏం... మామా ఊరి నుంచేనా..?" ఆత్రగా.

"ఆ ఊరి నుంచే."

"ఏమైంది ఊర్లో?"

"వెంకట్రామిరెడ్డి మర్డరైపోయినాడు."

కృష్ణారెడ్డి నెత్తిన పిడుగు పడినట్లయింది. వెంకట్రామిరెడ్డి ఎవరో కాదు. దూరపు బంధువు.

"ఎవరు చేయించారు?"

"నాకు మాత్రం ఏం తెలుసు! నేను ఊర్లో లేను. తాడిపత్రికి పోయింటి పని మీద."

"అక్కడ పరిస్థితి ఎట్లా ఉంది."

"ఏముంది..! ఊరు ఊరంతా వల్లకాడులా ఉంది. ఊర్లో మొగోళ్లు ఎవ్వరూ లేరు. అంతా పరారై పోయినారు. వెంకట్రామిరెడ్డి తమ్ముళ్లు, బావమరదులు కేను పెట్టించారు."

"ఎవరిమీద?"

"ఎవురి మీద పెట్టినారో సరిగ్గా తెల్దు. నారాయణరెడ్డిని మాత్రం ఇరికించినారు."

"నారాయణకు సంబంధం ఉందంటనా?"

"ఏమో మన కెట్లా తెల్సు?"

"నారాయణ చెప్పలేదా?"

"ఊళ్లో ఉంటే కదా! చెప్పడానికి."

"ఎక్కడున్నాడంట?"

"నాలుగు రోజులు మీ నారపరెడ్డి చిన్నాయన వాళ్ల ఇంట్లో ఉన్నాడంట. ఆ తర్వాత రెండు రోజులు మీ గోవిందరెడ్డి మామ ఇంట్లో ఉన్నాడంట."

"ప్రస్తుతం ఎక్క డున్నాడంట?"

"ఏమో... ఖచ్చితంగా తెలియదు. రోజూ పోలీసులు మాత్రం ఇంటికాడికి వచ్చిపోతున్నారు. మీ గాసిగాన్ని అరెస్టు చేసి జైల్లో పెట్టినారు. ఇంకా కొందరి కోసం ఎతుకుతున్నారంట."

"సాక్ష్యాలు ఏమైనా దొరికినా యంటనా?"

"మన పక్క చూసినా సాక్ష్యం ఎవరు చెపుతారు ఒకవేళ చెప్పితే చెప్పినోన్ని బతకనిస్తారా?"

"లేదు మామా! నువ్వు ఏదో నా దగ్గర దాస్తున్నావు."

"నీ దగ్గర దాచి పెట్టేదేముంది కృష్ణా! నువ్వేమి పరాయివాడివా... నీకు చెప్పింది ఏమీ లా... నారాయణ బ్రాందీ షాపు పెట్టిన నెలరోజుల కల్లా వెంకట్రామిరెడ్డి కూడా మనోడి షాపుకు ఎదురుగుండానే బ్రాందీ షాపు ఓపెన్ చేసినాడు. దాంతో మనోడు తిమ్మాపురంలో రెండో షాపు ఓపెన్ చేసినాడు. అక్కడా వెంకట్రామిరెడ్డి మనోడి షాపుకు ఎదురుగుండానే రెండో షాపు ఓపెన్ చేసినాడంట. అప్పట్నుంచి మనోడికి వాడికి మధ్య సరిగ్గా లేదు.

"ఏదో వాడి వ్యాపారం వాడిది. వీడి వ్యాపారం వీడిది. వెంకట్రామిరెడ్డి కాకుంటే ఇంకో రెడ్డి ఓపెన్ చేస్తాడు."

"బ్రాందీ.. సారాయి వ్యాపారాలు అట్లా ఊరికే ఉండనిస్తాయా? దానికి తోడు మన ఊరు చుట్టూ 'గనులు' త్రవ్వకాలు ఎక్కువైనాయి. రోజూ నూరు లారీల నాపరాయి తిమ్మాపురం పోతూ ఉంది."

"పోతే?"

"అక్కడే వొచ్చింది మనోడికి, వెంకట్రామిరెడ్డికి గొడవ."

"ఎట్లా!"

"ఏముంది... వెంకట్రామిరెడ్డి మన ఊరు నుంచి పోయే లారీ లోళ్లను బెదిరించి లారీకి నూర్రూపాయలు గేటు వసూలు చేసినాడంట."

"చేస్తే!"

"'మనోడు; వాడేనా మొగోడు' అని చెప్పి నగం లారీల దగ్గర వీడు గేటు వసూలు చేసినాడంట."

"వీళ్లు వీళ్లూ ఇష్టం వచ్చినట్లు గేటు వసూలు చేస్తూ ఉంటే అక్కడ పోలీసు స్టేషన్ లేదా? పోలీసులు లేరా?"

"ఉండారు... లేకేమి! అట్లా వారి దగ్గర, ఇట్లా వీడి దగ్గర గుంజక తింటున్నారు. పైగా మనోడు సొంత లారీ పెట్టుకున్నప్పటి నుంచి మనోడికి, వెంకట్రామిరెడ్డికి మధ్య వచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతోంది. ఎలక్షన్లో కూడా చెరో పార్టీకి మద్ద తిచ్చి తిరిగారంట. ఈ మధ్య ఎప్పుడో వెంకట్రామిరెడ్డి కర్నూల్లో బార్లో తప్పతాగి తన మనుషుల మధ్య మనోడి సంగతి చూసేయల్లని చెప్పినాడంట. ఒకటి రెండుసార్లు గాటు పెట్టినాడంట. మనోడి అదృష్టం బావుంది ఎట్లో తప్పించుకున్నాడు. తర్వాత వెంకట్రామిరెడ్డి మర్డర్ అయిపోయినా డనే వార్త నేను పేపర్లో చదివి ఆశ్చర్యపోయాను. ఈ యవ్వారం ఇంతదాకా వస్తుందని ఎవరూ అనుకోలేదు."

భాస్కరరెడ్డి ఎప్పటికప్పుడు కృష్ణారెడ్డి ముఖకవళికలు గమనిస్తూనే ఉన్నాడు.

"ప్రస్తుతం ఇంటికాడ పరిస్థితి ఎట్లా ఉంది మామా?"

"ఎట్లా... ఏమి.. ఏ క్రైమ్‌కు ఎట్లోనని పది మందిని కావలా పెట్టుకోని బతకతా ఉండారు. పైగా రోజూ ఇంటికాడికి వచ్చిపొయ్యేవాళ్లతో నందు లేకుండా ఉంది. పొయ్యి మీద కెక్కిన పాత్రలు దిగడం లేదు. మీ అమ్మ మాత్రం వండిపొయ్యలేక చస్తా ఉంది. వాళ్ల గురించి నువ్వేమీ దిగులుపడనక్కరలేదు. నువ్వు జాగ్రత్తగా ఉంటే చాలు. ఒంటరిగా ఎక్కడా తిరగొద్దని చెప్పారు. కొద్ది రోజులు మదనపల్లి కన్నా లేకుంటే చిత్తూరు కన్నా వెళ్లమన్నారు. నువ్వు ఎక్కడ ఉండేది తెలియజేస్తే అక్కడ పరిస్థితి చూస్తుకోని నీకు తెలియజేస్తారంట."

భాస్కరరెడ్డి తన పని అయిపోయిందన్నట్లు ఏకరువు పెట్టి చెప్పాడు.

"ఒకటి... రెండు... రోజులు ఉంటావా మామా?"

"వీలుపడదు. ఈ రోజే కొండకి పోయి దేవుణ్ణి చూసుకుని రాత్రి బస్సుకు పోతాను."

భాస్కరరెడ్డి కృష్ణారెడ్డి చూస్తూ ఉండగానే అడుగులు ముందుకు వేసుకుంటూ వెళ్లిపోయాడు.

*** *** ***

ఊర్లోకి అడుగుపెట్టిన కృష్ణారెడ్డికి ఊరి పరిస్థితి అర్థంకాలేదు. ఇదివరలో ఎప్పుడు ఊర్లోకి వచ్చినా "బాగుండావా రెడ్డీ" అని పలకరించేటోళ్లు, "ఎప్పుడు వచ్చావు రెడ్డీ" అనేటోళ్లు, "మీకు లక్షలు.. లక్షలు కట్నాలు ఇచ్చేటోళ్లు దొరకాల కదా" అని సాగదీసేటోళ్లు కనీసం పది మం దన్నా ఉండేవారు. ఇప్పుడు అలాంటి పలకరింపులు ఒకటి కూడా లేదు. బాగా తెలిసిన వాళ్లు కూడా ముఖం తప్పించుకొని పోతున్నారు. అందరూ ఏదో తప్పు చేసినవాడిని చూసినట్లు చూస్తున్నారు.


ఇంటి వాతావరణం కూడా అట్లే ఉంది. ఇంటి చుట్టూ పది మంది కావలా మనుషులు. ఎవరు ఎక్కడికి పోవాలన్నా ఒక రిద్దర్ని వెంటబెట్టుకుని పోవాల్సిందే. చివరకు దొడ్డికి వెళ్లినప్పుడుకూడా ఒక రిద్దరు 'బాడీ గార్డ్సు'లా ఉండాల్సిందే.

ఇలాంటి జీవితంలో ఏం సంతోషం, ఏం తృప్తి ఉన్నాయి చచ్చిన వాడు ఒక్క క్షణమే బాధపడి ఉంటాడు. బతికిన వాళ్లు క్షణ క్షణమూ చచ్చి బతుకుతూ ఉన్నారు. కృష్ణారెడ్డి దృష్టికి అదంతా ఓ జంతు సంస్కృతిలా కనబడుతూ ఉంది. అక్కడి మనుషులు ఇంకా ఆటవిక దశలోనే ఉన్నా రనిపించింది.

### భారీ సినిమాలు

అమితాబ్ బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్ దేశంలోని వివిధ భాషలలో పెద్దఎత్తున సినిమాలు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. రికార్డింగ్ కంపెనీతోపాటు విదేశీ చిత్రాల పంపిణీని కూడా ఈ సంస్థ చేపడుతోంది. ఏ.బి.సి.ఎల్. ప్రస్తుతం ఏడు చిత్రాలను నిర్మిస్తున్నది. అందులో ఒకటి అమితాబ్‌ది కాగా, తెలుగు, తమిళం, మలయాళం భాషలలో కూడా చిత్రాలు నిర్మిస్తున్నారు.

మసూద్ అన్సారి



ఫ్యాక్షన్ తత్వాన్ని గమనిస్తే డబ్బులేని వారు డబ్బు కోసం, డబ్బున్నవాడు అధికారం కోసం, ఈ రెండూ ఉన్నవాడు లాభార్జన కోసం, వ్యాపారాల కోసం ప్రాకులాడుతున్నట్లు కనిపిస్తోంది. లక్షలకు లక్షలు, కోట్లకు కోట్లు సంపాయించారు. మొత్తం ప్రాంతాన్ని దేశాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాల. అందరూ తన కనుసన్నల్లో మెలగాల. డబ్బు, అధికారం, పలుకుబడి తన ఆజ్ఞకు లోబడి ఉండాలనే మూర్ఖపు ఆలోచనలు ఎక్కువై పోతున్నాయి.

భూముల దగ్గరో, ఆడవాళ్ల దగ్గరో, వ్యాపారాల దగ్గరో, అధికారం దగ్గరో ఎక్కడో ఒక చోట పేచీలు పెట్టుకోవడం, ముఠాలు తయారుకావడం, పార్టీలు నడవడం, వాడి మనిషిని వీడు, వీడి మనిషిని వాడు చంపించడం, కోర్టు చుట్టూ తిరగడం, శిక్ష పడితే అధికారం వల్లో, డబ్బు వల్లో, పలుకుబడి వల్లో శిక్ష లేకుండా తప్పించుకోవడం చూస్తూ ఉంటే కృష్ణారెడ్డికి ఆశ్చర్యం వేస్తోంది. వీళ్ల జీవితాలు చూస్తే అసహ్యం పుడుతోంది.

ఒకటి రెండు రోజులకే కృష్ణారెడ్డికి ఊరి వాతావరణం మొగం మొత్తి నట్లుంది. ఇంట్లో కూడా ఎవరూ అభిమానంగా, ఆప్యాయంగా పలకరించుకోవడం లేదు. ఎప్పుడూ ఏదో హడావుడిగా, కాలుకాలిన పిల్లిలా తిరిగే తండ్రిని చూస్తే రోత పుడుతోంది. వంటింటికే పరిమితమై పచ్చిపోయే వాళ్లకు వండిపెడుతున్న తల్లిని చూస్తే జాలేస్తోంది. తమ్ముడు ఎక్క డున్నాడో, ఎట్లా ఉన్నాడో చెప్పే దిక్కు లేదు. ఎవర్ని అడిగినా 'అక్కడ ఉన్నాడు', 'ఇక్కడ ఉన్నాడు' అంటారే తప్ప ఖచ్చితంగా ఎవరూ చెప్పడం లేదు.

మధ్యాహ్నం భోజనాలు అయినాయి.

కృష్ణారెడ్డి సూట్‌కేస్ ముందరేసుకుని బట్టలు సర్దుకుంటూ కూర్చున్నాడు.

"ఏం కృష్ణా! అప్పుడే బట్టలు సర్దుకుంటున్నావు?"

"ఏం లేదు. వెళ్లాల నాన్నా. నా థీసిస్ వర్క్ ఫైనల్ డ్రాఫ్టు రాస్తున్నాను. మా ప్రొఫెసర్ మళ్లీ స్టేట్స్ వెళతాడంట. ఆలోపల సబ్‌మిట్ చేస్తే మంచిది. పైగా ఇక్కడ నేను ఉండిమాత్రం చేసేది ఏముంది."

"మరేం లేదు కృష్ణా! నా తొందరలో నే నుండి నీకు చెప్పడం మర్చిపోయాను. సాయంత్రాని కల్లా మీ పెదనాయన, మీ పెద్దమ్మ, మీ మామ, అత్త వస్తారు. వాళ్లు వచ్చినాక మనం అంతా కలిసి నంద్యాలకు పోయిరావాల."

"ఎందుకు?"

"ఏమీ లేదు. మొన్న శివరామిరెడ్డి బావ చెప్పి పంపినాడు. వాళ్ల అమ్మాయి బిఎస్‌సి చదివిందంట. కట్నం కూడా ఐదు లక్షల వరకు ఇస్తామని చెప్పినాడట. యాభై సవరాలు బంగారు పెడతాడంట. పెళ్లి కూడా తనే చేసి ఇస్తాడంట. మనకి మన్ని విషయాల్లో సాయంగా ఉంటాడట. వాళ్ల అమ్మాయిని నువ్వు చేసుకుంటే మన గొడవలు చాలా వరకు పరిష్కారమౌతాయి. మీ సంబంధానికి మీ అమ్మ కూడా ఒప్పుకుంది. ఎలాగు నువ్వు వచ్చావు. అమ్మాయిని ఒకసారి చూసి వెళితే మిగతా విషయాలు మేము పెద్దోళ్లు మాట్లాడుకుంటాం. మంచి రోజు చూసి తాంబూలాలు మార్చుకుని ముహూర్తం పెట్టుకుంటే సరిపోతుంది."

"ఎవరి పెళ్లి గురించి మీరు మాట్లాడుతుందేది?"

"నీ పెళ్లి గురించే."

"నేను ఇప్పుడే పెళ్లి చేసుకోదల్చుకోలేదు."

"అదేంది అట్లా మాట్లాడతావు?"

"లేకుంటే ఏంది నాన్నా! చదువు పూర్తిగాకుండానే, ఉద్యోగం సద్యోగం లేకుండానే పెళ్లి చేసుకుని ఊరేగమంటావా?"

"నా మాట విను. కావల్సినంత డబ్బు, కావల్సినంత ఆస్తి, పైగా ఇద్దరే కూతుళ్లు."

"వాళ్లకు ఎంత డబ్బు ఉంటే ఏం చెయ్యను? ఎంత ఆస్తి ఉంటే ఏం చెయ్యను? మూడు తరాలుగా ఫ్యాక్షన్‌లో ఇన్‌వాల్వ్ అయి ఉన్నారు. ఆ గొడవల వల్లే వాళ్ల తాత కూనీ అయిపోయ. ఆ గొడవల వల్లే వాళ్ల నాయన మర్డరైపోయ. మిగిలిందేది ఆయన, ఆయన తమ్ముడు. ఎప్పుడు ఉంటారో, ఎప్పుడు పోతారో వాళ్లకే తెలియదు."

"అదేం లేదు. ఇప్పుడు వాళ్లకు ఆ గొడవలు ఏమీ లేవు. పైగా ఈ సంవత్సరం ఆయనకే ఎంఎల్ఏ టికెట్టు ఇస్తామన్నారంట. తప్పకుండా గెలుస్తాడుకూడా. పలుకుబడి, డబ్బు, అధికారం అన్నీ ఉంటాయి. నీకు ఉద్యోగం దానంతకు అదే నడచి వస్తుంది. వాళ్లతో సంబంధం కలుపుకుంటే మనకు అన్ని విధాలా బావుంటుంది."

"నువు వెయ్యి చెప్పు. లక్ష చెప్పు నాన్నా! ఫ్యాక్షన్ అనేది అంటువ్యాధి లాంటిది. అది నివురుకప్పిన నిప్పులా ఉంటుంది. అప్పుడప్పుడు రాజుకుంటునే ఉంటుంది. ఆ ఊబిలో దిగడం నా కిష్టం లేదు. నా బతుకు ఏదో నేను బతుకుతాను. జీవితంలో హాయిగా, ప్రశాంతంగా బతకా లనుకున్నాను. మీలాగ భేషజం బతుకు బతకదల్చుకోలేదు. నాకు మీ రన్నా మీ పార్టీలన్నా మీ ముఠా లన్నా పరమ అసహ్యం.


ఏమాత్రం డొంకతిరుగుడు లేకుండా కృష్ణారెడ్డి తన అభిప్రాయం స్పష్టంగా చెప్పేశాడు. ఒక్క క్షణం కూడా తర్వాత అక్కడ ఉండా లనిపించలేదు కృష్ణారెడ్డికి.

తల్లి, తండ్రి, ఇంట్లో వాళ్లు, వీధిలో వాళ్లు అందరూ చూస్తూ ఉండగానే సూట్‌కేసు చేతబట్టుకుని కృష్ణారెడ్డి ఇంట్లో నుంచి అడుగులు ముందుకు వేశాడు.

అందరూ కృష్ణారెడ్డి వెళుతున్న దారివైపే దృష్టి సారించి నిలబడ్డారు. ●

# ఊర్మిళ సుషుప్తి

డా. ఎస్. పద్మావతి



పుట్టకముందు అమ్మ కడుపులో
ముడుచుకుని పడుకున్న ఎంబ్రియో
భూమి పైకి అవతరించాక
అన్ని పనులకి అస్వతంత్రతతో
చేతులు ముడుచుకున్న అశక్తత —
మూడు కాళ్ల ముదుసలివై
ముడుచుకుపోయిన ఆశయాల వెర్టెబ్రా —
స్త్రీ శక్తికి తరతరాల ప్రతీకలు!
తల ఎత్తి తిరిగితే పురుష ప్రపంచానికి
తలకొట్టినంత పని!
తల వంచుకునే తాళి కట్టించుకుని
తనని తాను వంచించుకున్న
ఆత్మోన్నత్యం — అవిచ్ఛిన్న సంప్రదాయం!
బంధనాలని అనుబంధాలుగా
మమతల బంగారు సంకెళ్లని
అమూల్యాభరణాలుగా
స్వీకరించే స్త్రీ మూర్తి
'క్షమయా ధరిత్రీ'!
'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి'